క్లుప్తంగా

నేలబెలుం ఆలయాభివృద్ధికి విరాళాలు



రూ.లక్షను ఆలయ కమిటీ సభ్యులకు అందజేస్తున్న దాత రామ్మోహన్‌రెడ్డి

కొలిమిగుండ్ల: బందార్లపల్లె సమీపంలోని పురాతన నేల బెలుం మల్లేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి దాతలు ముందుకొస్తున్నారు. సోమవారం అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణానికి చెందిన రామ్మోహన్‌రెడ్డి రూ.లక్ష, అవుకు మండలం చనుగొండ్లకు చెందిన మహీంద్ర ట్రాక్టర్స్‌కు చెందిన బాచం సోదరులు నాగేశ్వరరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వీరభద్రారెడ్డిలు రూ.50లను ఆలయ కమిటీ చైర్మన్ బాలవెంకటరెడ్డికి అందజేశారు.అలాగే అనంతపురం జిల్లా పుట్లూరుకు చెందిన భూమిరెడ్డి రామాంజనేయరెడ్డి, నాగార్జునరెడ్డి కల్యాణ మండపానికి రూ.3లక్షలతో రేకుల షెడ్డును నిర్మించారు. ముందుగా దాతలు కార్తీక మాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకొని స్వామికి అభిషేకంతో పాటు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు దాతలను సన్మానించారు.

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి..

బనగానపల్లె రూరల్: మండలంలోని టంగుటూరు గ్రామంలోని శ్రీ పెద్దమ్మ ఆలయం వద్ద శ్రీ పెద్దమ్మతల్లి నిత్యాన్నదాన భవన నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన బూజుటి వెంకట సుబ్బారెడ్డి సతీమణి వెంకటసుబ్బమ్మ, కుటుంబసభ్యులు రూ.50,116ల నగదు విరాళాన్ని సోమవారం అందజేశారు. దాత కుటుంబ సభ్యులు గంగాధర్‌రెడ్డి,నాగేశ్వరరెడ్డి ఉన్నారు.

ఘనంగా వెర్రిగోవిందస్వామి ఆరాధనోత్సవం

కొలిమిగుండ్ల: తిమ్మనాయినపేటలో వెలిసిన వెర్రిగోవిందరాజుల స్వామి 266వ ఆరాధనోత్సవాలు సోమవారం ఆలయ కమిటీ ,గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం మేళతాళాల మధ్య స్వామిని ప్రత్యేక పల్లకీలో గ్రామోత్సవం నిర్వహించారు.

వారధి నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని కోర్నపల్లె అభయాంజనేయస్వామి ఆలయ సమీపంలో కొండపై నూతనంగా నిర్మిస్తున్న పట్టాభి రామాలయం వద్దకు చేరుకునేందుకు వారధి నిర్మాణం కోసం సోమవారం భూమిపూజ చేశా రు.దాతల సహకారంతో దాదాపు రూ.1.50 కోట్ల వ్యయంతో పట్టాభి రామాలయం నిర్మాణంలో ఉంది. ఆలయానికి వెళ్లెందుకు సరైన రహదారి సౌకర్యం లేక పోవడంతో పెన్నా సిమెంట్, ఆలయ కమిటీ సభ్యులు, చుట్టు పక్కల గ్రామాల ప్రజల సహకారంతో రెండు కొండల మధ్య వారధి నిర్మాణం చేపట్టనున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పులి రామకృష్ణారెడ్డి, పెన్నా సిమెంట్ సివిల్ ఇంజినీర్ రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు బాలిరెడ్డి, రాష్ట్ర కల్లుగీత కార్మికుల సంఘం ఉపాధ్యక్షుడు కొండయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రవాణాపై స్పెషల్ డ్రైవ్



వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

డోన్ టౌన్ : అక్రమంగా ప్యాసింజర్లను తరలించే ఆటోలు, వాహనాలపై ఆర్టీసీ డిపో మేనేజర్ శశిభూషణ్, డోన్ ఎంవీఐ క్రాంతి కుమార్ సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పట్టణ సమీపంలోని కొట్లవారి పల్లె సర్కిల్, బేతంచెర్ల రోడ్డులో సోమవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పరిమితికి మించి లోడుతో వెళుతున్న వాహనాలు, పర్మిట్లు సరిగా లేని, ప్రమాదకరంగా వెళుతున్న 17 వాహనాలకు రూ.60,500 జరిమానా విధించారు. అలాగే ఇద్దరు ఆటో డ్రైవర్లు మద్యం సేవించి ప్రయాణికులను తరలిస్తుండగా అదుపులోకి తీసుకొని పట్టణ పోలీసులకు అప్పజెప్పారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

కోవెలకుంట్ల: స్థానిక వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం 74వ భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ బేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు కొమ్ముపాలెం శ్రీనివాసులు, ఓబయ్య, అధ్యాపకులు భాస్కర్ రెడ్డి, నాగేశ్వరరెడ్డి, ఉసేన్‌బాషా, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడి జీవితం స్ఫూర్తిదాయకం

- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి
- జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో కలిసి వివేకానంద విగ్రహావిష్కరణ
- రూ. 2 కోట్లతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ సిస్టం ప్రారంభం



వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం



సమావేశానికి హాజరైన జనం



సెంట్రల్ లైటింగ్ సిస్టంను ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల

డోన్: స్వామి వివేకానంద జీవితం స్ఫూర్తిదాయకమని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎల్ఐసీ కార్యాలయం వద్ద రూ.4 లక్షలతో వివేకానంద స్వామి సేవాసమితి ఏర్పాటు చేసిన వివేకానందుడి విగ్రహాన్ని మంత్రితో పాటు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల వెంకటరెడ్డి సోమవారం రాత్రి ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ వివేకానందుడి స్ఫూర్తితోనే సనాతన హిందూ ధర్మాన్ని కాపాడేందుకు అన్ని దేవాలయాల జీర్ణోద్ధరణకు కృషి చేస్తున్నామన్నారు. అన్ని మతాలు, కులాలకు సమన్యాయం చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకుంటున్న చర్యల గురించి మంత్రి వివరించారు. హైందవ సంస్కృతికి ప్రతిబింబాలుగా పిల్లలను మార్చాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ఈ సందర్భంగా సేవా సమితి అధ్యక్షుడు నాగభూషణం రెడ్డి, గౌరవాధ్యక్షుడు సప్తశైల తిమ్మయ్య, వ్యవస్థాపకులు మలిశెట్టి జగన్‌మోహన్, ప్రధాన కార్యదర్శి జొన్నలగడ్డ శ్రీను, కోశాధికారి ఏవీ రావు తదితరులు వివేకానందుడి జ్ఞాపికను మంత్రి బుగ్గన, జెడ్పీ చైర్మన్‌కు అందజేశారు. కార్యక్రమంలో మీట్ కార్పొరేషన్ స్టేట్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేశ్, శతావధాని, కళారత్న గండ్లూరి దత్తాత్రేయశర్మ, సభ్యులు తొగట సురేశ్ బాబు, సర్వజ్ఞమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ సిస్టం ప్రారంభం

పట్టణ సుందరీకరణ పనుల్లో భాగంగా రూ. 2 కోట్లతో ప్రధాన రహదారులపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ సిస్టంను మంత్రి, జెడ్పీ చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణాభివృద్ధికి విశేష కృషి చేసిన మంత్రి బుగ్గనకు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేశ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు కొత్రికే హరికిషన్, జాకీర్, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ అధ్యక్షులు మల్లెంపల్లె రామచంద్రుడు, కురుకుంద హరి, పార్టీ నంద్యాల జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు పోస్టుపసాద్ పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక



మంత్రి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీఆర్ నగర్‌కు చెందిన కుటుంబాలు

డోన్ : పట్టణంలోని తారకరామనగర్‌కు చెందిన డీలర్ ఎద్దుపెంట వెంకటేష్, మునిసిపల్ కోఆప్షన్ సభ్యులు కుమ్మరి రాజు ఆధ్వర్యంలో 30 కుటుంబాలు ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సమక్షంలో సోమవారం టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. మంత్రి బుగ్గన వారికి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీకి రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో బలిజ రాజు, జనార్దన్, కూరగాయల వెంకట్రాముడు, ఎరుకలి శివ, వడ్డె వెంకటేష్, బోయ శివ, సుకన్య, శకుంతల, ఎరుకలి మద్దమ్మ, బలిజ తిమ్మమ్మ, రాధ, వీరేష్, వినోద్, మంగలి పరమేష్, హరి, మనోజ్, మేకల శ్రీను, రసూల్, వెంకటస్వామి, బోయ నాగరాజు, చాకలిపవన్, వేణు, తరుణ్, బోయ కుమార్, సూరి, రాఘవేంద్ర, బాలక్రిష్ణ, సురేష్, రవి, రాజు తదితరులు ఉన్నారు.

కోవెలకుంట్లకు చేరుకున్న పాదయాత్ర



పాదయాత్రలో పాల్గొన్న కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

కోవెలకుంట్ల: 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175 స్థానాలు కైవసం చేసుకోవాలని ఆకాంక్షిస్తూ గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు బసవరావు బృందం పాదయాత్ర చేపట్టారు. వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు కొనసాగే పాదయాత్ర సోమవారం కోవెలకుంట్లకు చేరుకోగా పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, తేజారెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, పార్టీ లీగల్‌సెల్ జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకుడు శ్రీనివాసనాయక్, పార్టీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సహదేవరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, తదితరులు పాదయాత్రను స్వాగతిస్తూ మద్దతు తెలిపారు.

సంక్రాంతి నాటికి బేతంచెర్లకు తాగునీరు



మాట్లాడుతున్న నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి

బేతంచెర్ల : సంక్రాంతి పండుగ నాటికి బేతంచెర్ల పట్టణానికి వాటర్ గ్రిడ్ పథకం కింద గోరుకల్లు రిజర్వాయర్ నుంచి ఇంటింటికీ తాగునీరు అందిస్తామని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో వార్డు కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో చేపట్టే అభివృద్ధి పనులను, 2024–25 బడ్జెట్ వివరాలను కమిషనర్ రమేష్ బాబు వివరించారు. సంజీవనగర్, హనుమాన్ నగర్ కాలనీలకు ప్రజలు రైల్వే ట్రాక్ పై రాకుండా రైల్వే అధికారులు మూసి వేశారని, ఆ కాలనీల మీదుగా రెండు పుట్ ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేసే విశయాన్ని రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తీసుకెళ్లారని చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో టీపీ అంజద్ బాషా, ఏతులు శేఖర్, గోపాల్, నగర పంచాయతీ వైస్ చైర్మన్లు నాగ వెంకటేశ్వర్లు, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి



మొక్కలను పరిశీలిస్తున్న ఏపీడీ శ్రీ విద్య

బేతంచెర్ల : రహదారులకు ఇరువైపులా ఉపాధి హామీ పథకం కింద నాటిన మొక్కలను బాధ్యతగా సంరక్షించాలని ఏపీడీ శ్రీవిద్య సూచించారు. సోమవారం మండల పరిధిలోని గోరుమానుకొండ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కొడె వెంకటేశ్వర్లు, ఏపీఓ శేషన్న ఆధ్వర్యంలో రహదారి వెంట నాటిన మొక్కలను పరిశీలించారు. మొక్కలకు పశువుల నుంచి కాపాడేందుకు సంరక్షణ పనులతో పాటు నీటి వసతి కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్ నాగేష్, కూలీలకు సూచించారు.

కలశాలు, జ్యోతులతో భక్తుల పాదయాత్ర



జ్యోతులు తైల కలశాలతో పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె విశ్వహిందూ పరిషత్ సంఘటనా కార్యదర్శి దొంతా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తైల కలశాలు, జ్యోతులతో మహిళలు, భక్తులు నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయానికి పాదయాత్రగా సోమవారం తరలివెళ్లారు. స్థానిక రవ్వలకొండపై ఉన్న శ్రీహట్టిముని స్వామి ఆలయం వద్ద నుంచి సుమారు వంద మంది వివిధ గ్రామాలకు చెందిన భక్తులు తైల కలశాలు, జ్యోతులతో భజన గీతాలు అలపిస్తూ పట్టణంలోని పలు ప్రధాన రోడ్లు వెంట పాదయాత్రగా చేసుకుంటూ నందవరం అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి పూజలు చేసి రాత్రి భజన కార్యక్రమం చేపట్టారు. దొంతా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సకాలంలో వర్షాలు కురిసి రైతులు, కూలీలు అన్నివర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, లోకకళ్యాణార్థం అమ్మవారికి పూజలు చేస్తున్నట్లు తెలిపారు.

ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలి

కోవెలకుంట్ల: ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని మండలాల్లో రైతులు రబీలో వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని ఏడీఏ సుధాకర్ సూచించారు.సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడు తూ ఈ ఏడాది జిల్లాతో పాటు ఎగువ ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురువకపోవడంతో శ్రీశైలం జలాశయంలో నీరు పూర్తిస్థాయిలో లేదన్నారు. రిజ ర్వాయర్‌లో నీటి లభ్యత లేని కారణంగా ఎస్సార్బీసీ, కుందూనది, కేసీకెనాల్‌కు రాబోయే రోజుల్లో సాగు నీరు అందే పరిస్థితి లేదని చెప్పారు. ప్రస్తుతం సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల పరిధిలో ఖరీఫ్ వరి కోత, నూర్పిడి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయన్నారు. కోతల అనంతరం మళ్లీ వరి వేయకుండా మినుము, కొర్ర, పెసర, తదితర ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

డోన్ టౌన్ : నిరుద్యోగ యువతీ యువకులకు స్థానిక ప్రభుత్వ ఐటీఐ ఎదురుగా ఉన్న న్యాక్ కార్యాలయంలో స్వల్ప కాలిక వ్యవధిలో అసిస్టెంట్ సర్వేయర్, అసిస్టెంట్ పంబర్ల్ రంగాల్లో ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు న్యాక్ సంస్థ కో ఆర్డినేటర్ తిమోతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పాస్ అయ్యి 16 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల లోపు వయస్సున్న వారు అర్హులన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేసి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కల్గిన వారు న్యాక్ సంస్థలో స్వయంగా సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 7661828641 ఫోన్ చేయవచ్చన్నారు.

అయ్యప్పస్వాములకు భిక్ష



భిక్షను వడ్డిస్తున్న కాటసాని తిరుపాల్‌రెడ్డి

బనగానపల్లె : అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి అయ్యప్పస్వామి మాలధారులకు సోమవారం భిక్షను ఏర్పాటు చేశారు. పట్టణంలోని పెండేకంటినగర్‌లోని ఆయన స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో పలువురు అయ్యప్పదీక్షధారులు భిక్షను స్వీకరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్యాపిలి: పట్టణ సమీపంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టడంతో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన మోహన్ ద్విచక్రవాహనంపై పెట్రోల్ కోసం వెళ్లి తిరిగి వస్తుండగా అరుణాచల ట్రాన్స్‌పోర్టు వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీ కొట్టింది. ప్రమాదంలో మోహన్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. ప్రమాదంపై ప్యాపిలి పోలీసులు విచారణ చేపట్టారు.

బీమా సాయం అందజేత

బనగానపల్లె: మండలంలోని టంగుటూరు గ్రామానికి చెందిన షేక్ చిన్నహుస్సేన్ ఈ నెల 21న ఆటో ప్రమాదంలో మృతి చెందారు. సోమవారం వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద బాధిత కుటుంబ సభ్యులకు రూ.10వేల నగదును సచివాలయ సిబ్బందితో పాటు ఎంపీటీసీ మహానంది రెడ్డి, సర్పంచ్ సూర్యనాగమద్దిలేటి, ఉపసర్పంచ్ హనుమంత్‌రెడ్డి అందజేశారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

కొలిమిగుండ్ల: గ్రామ సచివాలయ సిబ్బంది పని వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఎంపీడీఓ సాయికృష్ణ సూచించారు. సోమవారం బెలుం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ సమయ పాలన పాటించాలని సూచించారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

బనగానపల్లె : మండలంలోని యాగంటిపల్లె గ్రామ సమీపంలోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహించే ఉచిత కంప్యూటర్ శిక్షణకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కేవీకే సీనియర్ ప్రధాన అధికారిణి ధనలక్ష్మి సోమవారం తెలిపారు. 18–30 ఏళ్లలోపు వయసు కలిగి, ఇంటర్, అపై విద్య కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. నాలుగు నెలల పాటు శిక్షణ ఉంటుందని, ఆసక్తి కలిగిన వారు 63032 44165, 97059 98056 నంబర్లలో సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

కేసు నమోదు

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని టంగుటూరు గ్రామానికి చెందిన గౌతారం సుబ్బరాయుడు, మద్దమ్మ, శౌభారాణిలపై దాడి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి సోమవారం తెలిపారు. అదే గ్రామానికి చెందిన ఆకుమల్ల ఓబులమ్మ అనే మహిళ తన ఇంటి ముందు సీసీ రోడ్డుపై ఉన్న మట్టిని తొలగించే సమయంలో పై ముగ్గురు కలిసి ఆమెను నానాబూతులు తిట్టి, కొట్టి గాయపరిచారన్నారు. బాధితురాలి కోడలు సరోజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

వివాహిత బలవన్మరణం

కోవెలకుంట్ల: పట్టణంలోని రంగరాజుపేటకు చెందిన ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. సోమవారం ఎస్ఐ వెంకటరెడ్డి అందించిన సమాచారం మేరకు.. కాలనీకి చెందిన బోయలక్ష్మి(31) కొంతకాలం నుంచి కడుపునొప్పితో బాధపడుతోంది. నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం రాత్రి క్రిమిసంహారక మందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. మృతురాలి తండ్రి తిరుపాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.



యాగంటిలో భక్తుల భారీ క్యూలైన్



కొలిమిగుండ్లలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

శంభో శంకర

బనగానపల్లె రూరల్: కార్తీక మాస రెండో సోమవారం సందర్భంగా శైవాలయాలకు భక్తులు పోటెత్తారు. శివ నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ తొటబుచ్చిరెడ్డిల ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలో వెలసిన శ్రీ శివపార్వతులకు ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు పెద్దపుష్కరిణిలో ప్రత్యేక స్నానాలు చేసి ఆలయ ధ్వజ స్తంభం, ఆలయం ప్రధాన గోపురం, పెద్దపుష్కరిణి వద్ద కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. అనంతరం ఆలయంలో ఏకశిలా రూపంలో కొలువైన శ్రీ ఉమామహేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఇదిలా ఉండగా భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో బనగానపల్లెకు చెందిన ఓ భక్తురాలి పర్సులో ఉంచుకున్న సుమారు రూ.20వేల సెల్ ఫోన్, రూ.2 వేల నగదును గుర్తితెలియని వ్యక్తులు అపహరించడంతో బాధిత మహిళ ఆలయ అధికారులకు ఫిర్యాదు చేశారు. తిరుపతి దేవదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్(ఆర్‌జేసీ) ఎస్‌వీఎస్ఎన్ మూర్తి ఆలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షణాధికారి హరిచంద్రా రెడ్డి, ఆలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

కోవెలకుంట్ల: బనగానపల్లె నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో సోమవారం కార్తీక పౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కోవెలకుంట్ల పట్టణంలోని గాంధీసెంటర్‌లో వెలసిన శివాలయం, నాగలింగేశ్వర స్వామి, పాటిమీద శివాలయం,ఏడుకొప్పెర్లబావి సమీపంలోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. మండలంలోని భీమునిపాడు పద్మనాభస్వామి ఆశ్రమంలో వెలసిన పంచబ్రహ్మలింగేశ్వరస్వామి, గుళ్లదూర్తి, కలుగొట్ల, బిజనవేముల, రేవనూరు, సౌదరదిన్నె, తదితర గ్రామాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి.

కొలిమిగుండ్ల: స్థానిక లలితా సుందరేశ్వరస్వామి, నేల బెలుం మల్లేశ్వరస్వామి, బెలుం సిద్ధరామేశ్వరస్వామి ఆలయాలతో పాటు గ్రామాల్లోని శివాలయాలు తెల్లవారు జామునే భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు కార్తీక స్నానాలు ఆచరించి భక్తి శ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించారు.

ప్యాపిలి: కార్తీక పౌర్ణమి సందర్భంగా మండలంలోని శివాలయాలు సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక నీలకంఠేశ్వర స్వామి దేవాలయం, రామలింగేశ్వర స్వామి దేవాలయం, మెట్టుపల్లిలోని కాకనవరం రామలింగేశ్వర స్వామి ఆలయం, పెద్దపొదిళ్లలోని రామలింగేశ్వర దేవాలయాలు వేకువ జామున నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం దీపాలు వెలిగించారు.

బేతంచెర్ల : హెచ్ కొట్టాల గ్రామ సమీపాన వెలసిన ముచ్చట్ల భ్రమరాంబామల్లికార్జునస్వామి, యంబాయిలోని రామలింగేశ్వరుడు, బైనపల్లె, ముసలాయి చెర్వు, రహిమానుపురం గ్రామాల్లో వెలిసిన కాశీవిశాలక్షి, విశ్వేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు పూజలు నిర్వహించి, కార్తీక దీపాలు వెలిగించారు.

డోన్ టౌన్ : పట్టణ సమీపంలోని కోట్లవారిపల్లెలో కొలువైన శ్రీగంగాభవాని సమేత గంగాధర్ లింగేశ్వర స్వామి సన్నిధానంలోని ఉసిరి చెట్టుకు కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బ్రహ్మానంద ఆచారికి సన్మానం



బ్రహ్మానంద ఆచారిని సన్మానిస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్ : మండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జేఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారిని ఘనంగా సన్మానించారు. సోమవారం పలుకూరు రామాలయంలో భక్త బృందం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం జరిగింది. భక్త బృందం అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ.. బ్రహ్మానంద ఆచారి తమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పలు సేవా కార్యక్రమాలను గుర్తించి గుంటూరు జిల్లా చిలకలూరిపేటకు చెందిన జయజయసాయి ట్రస్ట్ జాతీయ సేవా పురస్కారానికి ఎంపిక చేసిందన్నారు. ఈనెల 26న జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు పూసపాటి బాలాజీ అవార్డును అందజేశారని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ రజకసంఘం అధ్యక్షులు చాకలిబాలన్న, బాలహనుమంతు, మధు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని తిమ్మనాయినపేట ఎస్సీ కాలనీలో ఓ వ్యక్తి సోమవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కాలనీకి చెందిన రామ్మోళ్ల నాగేంద్ర(44) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా రెండేళ్ల నుంచి భార్య పుట్టినిల్లు బనగానపల్లె మండలం వెంకటాపురంలో కుమారుడుతో కలిసి ఉంటోంది. ఇంట్లో ఎవరూ లేక పోవడంతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్‌రెడ్డి తెలిపారు.

రామరత్నగిరిలో చోరీ

ప్యాపిలి: మండల పరిధిలోని రామరత్నగిరి గ్రామంలోని ఓ ఇంట్లో ఆదివారం చోరీ జరిగింది. రామరత్నగిరికి చెందిన బెస్త నడిపి రంగస్వామి కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి పొలానికి వెళ్లారు. ఆదివారం మధ్యాహ్నం సమయంలో పొలం నుంచి ఇంటికి వచ్చిన రంగస్వామి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నట్లు గమనించాడు. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా 6 తులాల బంగారు నగలతో పాటు రూ. 50 వేలు కనిపించలేదు. దీంతో సోమవారం జలదుర్గం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

బనగానపల్లె రూరల్ : మండలంలోని పాతపాడు, మీరాపురం గ్రామంలో ఈఓఆర్‌డీ గురుప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర జరిగింది. కార్యక్రమంలో ఏఓ సుబ్బారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ, పశువైద్యులు రామ్‌కుమార్‌రెడ్డి, సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ, డాక్టర్ శివశంకరుడు, యూనియన్ బ్యాంకు మేనేజర్ మల్లికార్జునరెడ్డితో పాటు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న పలు పథకాలను వివరించారు. పంచాయతీ కార్యదర్శులు శంకుతల, ఖలీల్, నాయక్ పాల్గొన్నారు.